క్లుప్తంగా

25 నుంచి మేరీమాత పుణ్యక్షేత్ర వేడుకలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బిషప్ ప్రకాష్

కూసుమంచి: పాలేరులోని మేరీమాత పుణ్యక్షేత్రంలో ఈ నెల 25 నుంచి 31 వరకు మేరీమాత పుణ్యక్షేత్ర వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆర్సీఎం బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్ తెలిపారు. ఈ మేరకు శనివారం వేడుకల పోస్టర్లను విడుదల చేశారు. ప్రతీ రోజు నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాలకు క్రైస్తవులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాలేరు విచారణ గురువు కొమ్ము ఆంటోని, మేత్రాసనం, సురపల్లి హైజాక్, విజయ్‌కుమార్, కొమ్ము ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించిన ఎమ్మెల్సీ

రఘునాథపాలెం: మండలంలోని కోయచలకలో అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ నిధుల ద్వారా ఎల్‌ఓసీలను శనివారం ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు అందించారు. బీఆర్‌ఎస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన గుంటి వెంకటేశ్వర్లుకు రూ.36 వేలు,, మాధంశెట్టి రాధకు రూ.27 వేలు, దాట్ల కవితకు రూ.9 వేలు, తూము నాగేశ్వరరావుకు రూ.22 వేలను ఆయన అందజేశారు. కార్యక్రమంలో కోయచలక బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు చెరుకూరి భిక్షమయ్య, నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వీల్ చైర్ వితరణ



వీల్‌చైర్ అందిస్తున్న ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని శ్రీనివాస్‌నగర్‌కు చెందిన మేకల నర్సమ్మకు ఎన్‌ఆర్‌ఐ ఫౌండేషన్ ఆధ్వర్యాన శనివారం వీల్‌చైర్‌ను వితరణ చేశారు. ఈ చైర్‌ను 17వ డివిజన్‌కు చెందిన ప్రతినిధులు దనాల శ్రీకాంత్, వడ్డెల్లి లెనిన్ చౌదరి తదితరులు ఆమెకు అందించారు. ఈ కార్యక్రమంలో బాధితురాలి కుటుంబ సభ్యులు, డివిజన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం



కార్మికులకు పరీక్షలు చేస్తున్న వైద్యుడు

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లి టోల్ ప్లాజా వద్ద స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన శనివారం నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. హైపర్ టెన్షన్, డయాబెటిక్‌కు సంబంధించి 30 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్.శ్రావణ్‌కుమార్ అనారోగ్య సమస్యలు తలెత్తకుండా పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టోల్‌ప్లాజా మేనేజర్ చంద్రశేఖర్, ఏఎన్‌ఎం నాగమణి, ఆశా కార్యకర్తలు, పారా మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఒత్తిడికి గురవుతున్న ప్రైవేట్ టీచర్లు'

ఖమ్మం సహకారనగర్: వేసవి సెలవుల్లో ప్రైవేట్ విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించినా.. కొన్ని విద్యాసంస్థలు అడ్మిషన్ల పేరుతో ఉపాధ్యాయులతో స్కూల్ కాంపెయినింగ్ చేపిస్తున్నారని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం (టీపీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు కొరకొప్పు రామారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని, ప్రైవేటు టీచర్ల మనోవేదన, ఒత్తిళ్లకు గురికాకుండా చూడాలన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	హిట్: ది థర్డ్ కేస్
వినోద	సింగిల్
సాయిరాం	ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్ లైన్స్
ఆదిత్య	యమదొంగ
శ్రీనివాస	ఎలెవన్, దేశముదురు

- ఖమ్మంగాంధీచౌక్

సల్లగుండాలని..



వేసవిలో సేదదీరుస్తున్న 'మజ్జిగ'
- గాంధీచౌక్‌లో ఆరేళ్లుగా పంపిణీ
- ఏటా వేసవిలో నెల పాటు కార్యక్రమం
- ప్రత్యేక రోజుల్లో దాతల వితరణ



మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు, దాతలు (ఇన్‌సెట్) మజ్జిగ తాగుతున్న బాటసారులు

సండే స్పెషల్

ఖమ్మంగాంధీచౌక్: ఎండ తీవ్రత సతమతం చేస్తున్న వేళ నగరంలోని గాంధీచౌక్‌లో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కేంద్రం బాటసారులకు బాసటగా నిలుస్తోంది. వ్యాపార కేంద్రంగా విరాజిల్లుతున్న గాంధీచౌక్‌లో నిత్యం వివిధ వర్గాల ప్రజలతో రద్దీగా ఉంటుంది. ఈనేపథ్యాన వేసవితాపం నుంచి ఉపశమనం కలిగించేలా షిర్డీ సాయి మందిరం చైర్మన్ డాక్టర్ వేములపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన గత ఆరేళ్లుగా మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. వేసవిలో చేపట్టే ఈ కార్యక్రమానికి వ్యాపారులు, వివిధ వర్గాల వారు సైతం తోడ్పాటు అందిస్తున్నారు. మందిర కమిటీ, వ్యాపారులు అర్వపల్లి నిరంజన్, కురివెళ్ల జగన్, పీవీడీ.ప్రసాద్, కాకరపర్తి సత్యనారాయణ, గన్నారపు నాగేశ్వరరావు, తీర్థాల శ్రీను, నూనె శ్రీను, ఉమేష్, ఆనంద్, సీతయ్య తదితరులు సహకారాన్ని అందిస్తున్నారు.

నిత్యం 1,500 మందికి పైగా..

మండు వేసవిలో ఉదయం 11 గంటల నుంచి గాంధీచౌక్ సెంటర్ హనుమాన్ విగ్రహం వద్ద మజ్జిగ పంపిణీ మొదలవుతుంది. ఇక్కడ ప్రధానంగా గాంధీచౌక్ ప్రాంతం హమాలీలు, కార్మికులు, వ్యాపారులు, చేతి వృత్తుల వారు ఈ కేంద్రంలో మజ్జిగ తాగి ఎండ నుంచి ఉపశమనం పొందుతున్నారు. నిత్యం 1500 మంది నుంచి 2 వేల మందికి 600 నుంచి 800 లీటర్ల వరకు మజ్జిగ పంపిణీ చేస్తున్నారు.

శుభకార్యాల సందర్భంగా..

పెళ్లిరోజు, పుట్టిన రోజు, పెద్దల సంస్మరణ రోజు తదితర కార్యాలను పురస్కరించుకుని కొందరు దాతలు మజ్జిగ పంపిణీకి ముందుకొస్తుండగా.. మరికొందరు వేసవి దృష్ట్యా వితరణ చేస్తున్నారు. ఒకే రోజు అధిక సంఖ్యలో దాతలు ముందుకొస్తే వేలాది మందికి గంటల తరబడి పంపిణీ చేస్తున్నారు.



మజ్జిగ సిద్ధం చేస్తున్న నిర్వాహకులు

ఆరోగ్యానికి ఔషధంలా..

మజ్జిగ ఆరోగ్యానికి దివ్య ఔషధంగా పనిచేస్తుంది. శరీరం నీరసించకుండా అంటే డీహైడ్రేషన్‌కు గురిగాకుండా పనిచేస్తుంది. జీర్ణక్రియను మెరుగుపర్చడం, చర్మాన్ని పొడి బారకుండా కాపాడడంతో పాటు దానిలోని లాక్టిక్ యాసిడ్ రోగ నిరోధక శక్తిని పెంచుతుంది.

ఆరేళ్లుగా పంపిణీ చేస్తున్నాం.



ఎండ నుంచి ఉపశమనం కోసం గత ఆరేళ్లుగా మజ్జిగ పంపిణీ చేస్తున్నాం. ఈ మార్గంలో వెళ్లే వారికి, వ్యాపారులు, కార్మికులకు ఇది ఉపయోగపడుతోంది. ఇందుకు దాతల సహకారం ఉంది. ఎండ తీవ్రత ఆధారంగా నెల పాటు నిర్వహిస్తాం.

– డాక్టర్ వేములపల్లి వెంకటేశ్వరరావు, చైర్మన్, షిర్డీ సాయి మందిరం

బాబు పుట్టిన రోజని..



మా కుమారుడి పుట్టిన రోజు సందర్భంగా మజ్జిగ పంపిణీ చేస్తున్నాం. మరొకరు తాటికొండ శ్రీనివాసశాస్త్రి – సుగణ కూడా వితరణకు ముందుకొచ్చారు. 800 లీటర్లకు పైగా మజ్జిగ పంపిణీకి సహకారం అందించాం. ఈ విషయంలో ఎంతో సంతృప్తిగా ఉంది.

– గన్నవరపు లక్ష్మీనారాయణ – శారద, ఖమ్మం

దాహార్తి తీరుస్తోంది..



ఎండలోనే వివిధ ప్రాంతాలకు సరుకులు రవాణా చేస్తుంటాం. దీంతో నీరసానికి గురవుతుంటాం. ఇక్కడ పంపిణీ చేసే మజ్జిగ తాగుతుండడంతో ఉపశమనం కలుగుతుంది. నిత్యం వ్యాపారులు, హమాలీ కార్మికులకు ఇది ఎంతో ప్రయోజనం కలిగిస్తోంది.

– ఉడుగుల వెంకన్న, హమాలీ, ఖమ్మం

పీఏసీఎస్ రుణాలను వినియోగించుకోండి



మాట్లాడుతున్న సీఈఓ వెంకటాదిత్య

ఖమ్మంరూరల్: సహకార సంఘాల ద్వారా తక్కువ వడ్డీతో మంజూరు చేసే ఎల్‌టీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ ముఖ్య కార్య నిర్వహణాధికారి వెంకటాదిత్య తెలిపారు. శనివారం ఏదులాపురం పీఏసీఎస్‌లో రైతులకు జరిగిన అవగాహన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ పంటల సాగుకోసం రుణాలు మరింతమందికి ఇచ్చేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. రైతులు ప్రైవేట్‌గా అప్పులు చేయకుండా పీఏసీఎస్‌లో రుణం పొందాలన్నారు. తీసుకున్న రుణాన్ని తిరిగి బ్యాంక్‌లు చెల్లించి బ్యాంక్‌ల లావాదేవీలకు సమకరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎంలు ప్రవీణ్, కల్యాణి, మేనేజర్ అనిల్, సంఘం అధ్యక్షుడు జర్పుల లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వీధిలైట్ల ఏర్పాటు..



పెదతండాలో వీధిలైటు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంరూరల్: ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో వివిధ వార్డుల్లో శనివారం మున్సిపల్ అధికారులు వీధిలైట్లు ఏర్పాటు చేశారు. ఈ నెల 16న అంధకారంలో ఏదులాపురం అనే శీర్షికన వచ్చిన కథనానికి స్పందించిన మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి వీధిలైట్లు ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఏదులాపురం, పెదతండాలలో లైట్లు ఏర్పాటు చేయిస్తున్నారు. నాలుగైదు రోజుల్లో అన్ని వార్డుల్లో ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టారు.

నేడు పోటు ప్రసాద్ స్మారక స్తూపం ఆవిష్కరణ

ఖమ్మం మామిళ్లగూడెం: దివంగత సీపీఐ నేత, సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ స్మారక స్తూపం ఆవిష్కరణ కార్యక్రమం బోనకల్ రోడ్డులోని ఆదిత్య థియేటర్ వద్ద ఆదివారం జరగనుందని కార్పొరేటర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బీజీ క్లెమెంట్ శనివారం తెలిపారు.

దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ సలాం

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహమ్మద్ సలాం డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మం శ్రీనివాస్‌నగర్ కాల్వ కట్ట ప్రాంతం 17వ డివిజన్ నిర్వహించిన మహాసభలో ఆయన మాట్లాడుతూ.. కార్పొరేషన్ ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించి తాగునీటి ఎద్దడిని నివారించాలని డిమాండ్ చేశారు. నాడు నిర్మించిన వాటర్ ఫిల్టర్ బెడ్ ఇప్పుడు సరిపోవడం లేదని, పెద్ద ఫిల్టర్ బెడ్లు పెట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. త్రీ టౌన్ కార్యదర్శి నూనె శశిధర్ మాట్లాడుతూ.. త్రీటౌన్ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి భూక్యా రవీందర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేయకుండా వెంటనే పేదలకు పక్కా ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ చారి, శేఖర్, సందీప్, వెంకటేశ్వర్లు, సుభద్ర, సోమయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కమిటీ ఎన్నిక వాయిదా

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని రామాలయంలో శనివారం తెలుగుదేశం పార్టీ మండల కమిటీ ఎన్నికపై పరిశీలకుడు ఎం.అప్పారావు సమక్షంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అయితే అధ్యక్ష పదవి కోసం నూక హనుమంతరావు, సీతారాంబాబు, ఎస్.మల్లయ్యలు, ప్రధాన కార్యదర్శి పదవికి గుండు శ్రీను, టి.నాగేశ్వరరావు, వి.హనుమంతరావు, వీరస్వామి, కారంగుల వీరబాబు, అడపాల రవీందర్, జి.ప్రసాద్‌లు పోటీ పడ్డారు. పోటీ తీవ్రంగా ఉండడంతో గ్రామ కమిటీల వారీగా అభిప్రాయ సేకరణ చేశారు. కాగా, అధ్యక్ష పదవిని బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అభిప్రాయ సేకరణను జిల్లా కమిటీకి ఇవ్వనున్నట్లు పరిశీలకుడు తెలిపారు. మాజీ ఎంపీపీ తీగ వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.రామకృష్ణ, నాయకులు కరుణాకర్, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మండల అధ్యక్షుడిగా కోటేశ్వరరావు

కూసుమంచి: టీడీపీ మండల అధ్యక్షుడిగా కేశవాపురం గ్రామానికి చెందిన మండపల్లి కోటేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయనతో పాటు ఉపాధ్యక్షుడిగా అడపా శివ, ప్రధాన కార్యదర్శిగా నలగాటి రామనాథం, తెలుగు యువత మండల అధ్యక్షుడిగా ఉప్పల ఉదయ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా గోవిందు ఎల్లయ్య, జిల్లా కమిటీ సభ్యుడిగా గోపె వెంకన్న నియమితులయ్యారు. ఈ ఎన్నికను పార్టీ పరిశీలకుడు ఎం.అప్పారావు, పాలేరు ఇన్‌చార్జ్ కె.కరుణాకర్ సమక్షాన నిర్వహించారు.

అటెన్షన్ ప్లీజ్

మరీ ఇంత నిర్లక్ష్యమా..!



అది ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్డు.. ఎప్పుడూ వచ్చిపోయే వాహనాలతో రద్దీగా ఉంటుంది. అటువంటి రోడ్డుపై ఇలా ట్రాక్టర్‌లో రాళ్లను రవాణా చేస్తున్నారు. కనీసం ట్రాక్టర్ డోర్‌ను కూడా వేయకుండా తరలిస్తున్నారంటే డ్రైవర్ల నిర్లక్ష్యం ఏ రీతిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. వెనుక నుంచి వాహనాలు వచ్చిన సమయాన రాళ్లు కిందపడితే ప్రమాదం జరిగే అవకాశాలున్నాయని, ఇకనైనా అధికారులు పట్టించుకోవాల్సిన అవసరం ఉందని ఎంతైనా ఉందని వాహనదారులు వాపోతున్నారు.

– ఖమ్మంమయూరిసెంటర్

'ఉపాధి'పై కేంద్రానికి చిన్నచూపు



కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

ఖమ్మంరూరల్: ఉపాధి హామీ కూలీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ అన్నారు. శనివారం మండలంలోని ముత్యాలగూడెంలో జరుగుతున్న ఉపాధి పనులను సందర్శించి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఉపాధి పథకాన్ని రద్దు చేయాలని చూస్తోందని, అందుకు సరైన నిధులు కేటాయించడంలో తాత్సర్యం చేస్తూ చిన్నచూపు చూస్తుందన్నారు. ఈనెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 19న పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని వాడవాడలా నిర్వహించాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాపనేని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీ'



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: ప్రజాస్వామ్యాన్ని కేంద్రంలోని బీజేపీ ఖూనీ చేస్తుందని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ అన్నారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఆదేశాలతో శనివారం నగరంలో ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యాన బీజేపీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జాతీయ పార్టీ నేత రాహుల్‌గాంధీకి వస్తున్న జనాదరణను చూసి ప్రధాని మోదీ, నితీష్‌కుమార్‌లు ఓర్వలేకనే బిహార్ పోలీసుల ద్వారా దళిత విద్యార్థులను కలువకుండా చేశారన్నారు. మతతత్వ బీజేపీ పార్టీకి ప్రజలు బుద్ధిచెప్పే రోజు త్వరలోనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బాలగంగాధర్, కుక్కల మహేష్, క్రాంతికుమార్, కిరణ్, సత్యం, నాగరాజు, ఖైజర్, ఆర్‌కె నాయుడు, జితేందర్, సాయి పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



షాపును ప్రారంభిస్తున్న చైర్మన్ హనుమంతురావు

రఘునాథపాలెం: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతురావు అన్నారు. శనివారం ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్ సమీపాన రఘునాథపాలెం మండలం వేపకుంట్ల గ్రామ పంచాయతీకి చెందిన వసుంధర గ్రూపు సభ్యురాలు సుజాత ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన స్త్రీ టీకొట్టును ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా బలపడాలనే ఉద్దేశంతో కలెక్టర్ సూచనల మేరకు దుకాణం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ విల్సన్‌బెన్నీ, ఏపీఎం కె.సుబ్బారావు, ఎంఎస్ అధ్యక్షురాలు శారద, సీసీలు జ్యోతి, భిక్షమయ్య, వెంకటేశ్వరరావు, రేణుక, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

విత్తన ఎంపికలో జాగ్రత్తలు అవసరం

కూసుమంచి: వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యాన రైతులు విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటిస్తూ నాణ్యమైన విత్తనాలనే కొనుగోలు చేయాలని ఏఓ వాణి సూచించారు. శనివారం మండలంలోని జుజుల్‌రావుపేట, చౌటపల్లి గ్రామాల్లో రైతు గుర్తింపు కార్డుల నమోదు కార్యాక్రమాన్ని పరిశీలించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులు తప్పక రశీదులు పొందాలని, విత్తనాల ప్యాకెట్లను పంట పూర్తయ్యే వరకు జాగ్రత్తగా భద్రపర్చాలన్నారు. గ్రామాల్లో నకిలీ విత్తనాలు అమ్ముతున్న వారిని గుర్తిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు నవీన్, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతే భవిష్యత్‌కు పునాది



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న హార్వెస్ట్ యాజమాన్యం

ఖమ్మంఅర్బన్: విద్యారంగంలో సృజనాత్మక ఆలోచనలే విద్యార్థి భవితకు బలమైన పునాది వేస్తాయని జిల్లా విద్యాశాఖాధికారి సామినేని సత్యనారాయణ తెలిపారు. వీ.వీ.పాలెంలోని సెడార్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ తరగతు (సమ్మర్ క్యాంప్)లు శనివారం ముగియగా ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. పిల్లలు టీవీ, సెల్ ఫోన్లకు అలవాటు పడకుండా స్కేటింగ్, సంగీతం, చేతిరాత, నృత్యం, స్విమ్మింగ్‌లో శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. స్కూల్ కరస్పాండెంట్ పి.రవిమారుత్, డైరెక్టర్లు ఆర్.పార్వతీరెడ్డి, ఉదయశ్రీ మాట్లాడుతూ చిన్నారుల్లో ఆత్మవిశ్వాసం, ఆలోచనా శక్తి, కళానైపుణ్యాలు పెంచేలా వివిధ అంశాల్లో శిక్షణ ఇవ్వగా 75 మంది హాజరయ్యారని తెలిపారు. అనంతరం విద్యార్థులు సంగీతం, నృత్యం, యోగా తదితర ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.


ముగిసిన క్యాంప్..

ఖమ్మం సహకారనగర్: హార్వెస్ట్ విద్యాసంస్థల్లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు శనివారం ముగియగా నిర్వహించిన సమావేశాన్ని మేయర్ పునుకొల్లు నీరజ, విద్యాసంస్థల చైర్మన్ నాగమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ స్ప్రింగ్ లీఫ్, టెండర్ రూట్స్ పాఠశాలల్లో విద్యార్థులకు ఏర్పాటుచేసిన సమ్మర్ క్యాంపులతో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి మాట్లాడుతూ..పిల్లలు చదువు, ఆటపాటలకు దూరం కాకుండా తమ విద్యాసంస్థల ఆధ్వర్యాన సమ్మర్ క్యాంపు ఏర్పాటుచేయగా 150మంది చిన్నారులు పాల్గొన్నారని తెలిపారు.

ఇక ప్రతీ రైతుకు గుర్తింపు..

కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలు రైతులకు వర్తింజేసేందుకు ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. అయితే రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన పథకాలకు సంబంధం లేకుండనుండగా.. కేవలం కేంద్రం అందించే పీఎం కిసాన్, పీఎం ఫసల్ బీమా, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, భారత ఆహార భద్రత మిషన్ వంటి పథకాలకు మాత్రమే వర్తించనుంది. ఫార్మర్ ఐడీ పొందేందుకు ఆయా రైతుల ఆధార్, పాస్ పుస్తకాన్ని ఆధార్ కార్డుకు లింక్ చేసిన ఫోన్ నంబర్‌తో వ్యవసాయ అధికారి, ఏఈఓలను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది.

- కేంద్ర ప్రభుత్వ పథకాలకు రైతు రిజిస్ట్రీ తప్పనిసరి
- పాస్ పుస్తకాలు ఉన్న అందరికీ వర్తింపు



నేలకొండపల్లిలో నమోదు చేస్తున్న ఏఈఓ

నేలకొండపల్లి: పాలేరు నియోజకవర్గం వ్యాప్తంగా 29 రైతు వేదికల్లో నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. డివిజన్‌లో మొత్తం దాదాపు 80 వేల మంది రైతులు ఉండగా.. వారి ఆధార్ సంఖ్యతో అనుసంధానమైన పట్టాదారు పాస్‌పుస్తకంలోని భూ వివరాలతో రైతులకు 11 అంకెల గుర్తింపు కార్డును కేటాయించేందుకు చర్యలు చేపట్టారు. ప్రత్యేక శిక్షణ వ్యవసాయాధికారులు ఈ నెలాఖరు కల్లా అన్ని రైతు వేదిక పరిధిలో నమోదు కార్యక్రమాన్ని శరవేగంగా చేపట్టారు. కాగా, జనవరి 1 నాటికి పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులకు మాత్రమే ఈ అవకాశం ఉంది.

సాంకేతిక సమస్యలు..

పలు గ్రామాల్లో రైతులకు ఆధార్ అప్‌డేట్ సమస్యలు ఎదురవుతున్నాయి. పుట్టిన తేదీ సరిగా లేకపోవడం, ఇంటి పేరు, చిరునామాలు తప్పుగా నమోదు కావడం వంటి సమస్యలు ఉన్న వారు ఆధార్ కేంద్రాలకు వెళ్లి సవరణ చేయించుకుంటున్నారు. రైతులు భూ యాజమాన్య పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్, ఫోన్ నంబర్‌తో ఏఈఓల వద్ద నమోదు చేసుకున్నాక ఓటీపీ ద్వారా గుర్తింపు సంఖ్య నమోదవుతోంది.


ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు



పత్రాలు స్వీకరిస్తున్న ఏఓ తారాదేవి


కామేపల్లి: కేంద్ర ప్రభుత్వం రైతులకు అందించే పథకాలు లబ్ధి పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్ రైతు గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి భూక్యా తారాదేవి అన్నారు. శనివారం మండలంలోని పొన్నేకల్, ముచ్చర్ల, మద్దులపల్లి, కొత్తలింగాల, కొమ్మినేపల్లి రైతు వేదికల్లో ఏఈఓలు చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను ఆమె పరిశీలించి ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. భూభారతి పోర్టల్‌లో భూమి ఉన్న ప్రతీ రైతు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ లింక్ అయినా ఫోన్ నంబర్‌తో ఆయా క్లస్టర్ పరిధిలోని ఏఈఓలను సంప్రదించి ఆన్‌లైన్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు శ్రీకన్య, వేదిత, ఉష, జగదీశ్వర్, దీపక్‌రెడ్డి, రవికుమార్, రైతులు కాకర్ల వెంకటేశ్వర్లు, వెంకట నాగలింగం, అనంతరాములు, నల్లబోలు వెంకటరెడ్డి, అజ్మీరా బన్సీలాల్ పాల్గొన్నారు.

నమోదు తప్పనిసరి..



కేంద్ర ప్రభుత్వ పథకాల కోసం ఫార్మర్ రిజిస్ట్రీ నమోదును రైతులందరూ చేయించుకోవాలి. ఇందుకు ప్రతీ రైతు వేదికల్లో ఏఈఓలు అందుబాటులో ఉంటారు. ఈ నెలాఖరు కల్లా నమోదు చేయించుకోవాలి. – బి.సరిత, ఏడీఏ, కూసుమంచి

అవగాహన కల్పించాలి..



ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమంపై రైతులకు అవగాహన కల్పించాలి. గుర్తింపు వలన రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించాలి. వారిలో చైతన్యం నింపేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలి.

– రావెళ్ల కృష్ణారావు, మోటాపురం, రైతు